MRR 69 TV


అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 42 | సోమవారం 23 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-







# ఎవరికో సీటు?

రాష్ట్రంలో రాజ్యసభ సీట్ల కోసం పెద్ద సంఖ్యలో ఆశావహుల పోటీ

మార్చి 3 వరకు నామినేషన్లకు గడువు ఉండటంతో ఎంపికపై కసరత్తు షురూ

ఢిల్లీలో అధిష్ఠానం వద్ద లాబీయింగ్ చేస్తున్న కొందరు నేతలు

సీనియార్టీకా? విధేయతకా?

లేక పార్టీ అవసరాలకా?

ఆ 2 సీట్లు వరించేదెవరిని?





**హైదరాబాద్**

రాష్ట్రంలో రాజ్యసభ సీట్ల కోసం కాంగ్రెస్ పార్టీలో పెద్ద సంఖ్యలో ఆశావహులు పోటీ పడుతున్నారు. మార్చి 3 వరకు నామినేషన్లకు గడువు ఉండటంతో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ముమ్మరమైంది. కొందరు ఢిల్లీలో అధిష్ఠానం వద్ద లాబీయింగ్ చేస్తున్నారు. మరికొందరు రాష్ట్రంలో ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడి ద్వారా ప్రయత్నాలు జరుపుతున్నారు. జాతీయ ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలు, సామాజిక సమతౌల్యం ఈ మూడు అంశాలను దృష్టిలో పెట్టుకుని ఇద్దరు అభ్యర్థులను ఎంపిక చేసే దిశగా రాష్ట్ర, జాతీయ నాయకత్వాలు కసరత్తు చేస్తున్నాయి. రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికల వేడి పెరిగింది. రెండు సీట్లు ఖాళీ కావడంతో వాటి భర్తీకి అవసరమైన పూర్తి మెజారిటీ ఉన్నట్లు కాంగ్రెస్ చెబుతోంది. ఒక సీటు ఏఐసీసీ కోటా కింద వెళ్లే అవకాశం ఉండగా, మరొకటి రాష్ట్ర ప్రాధాన్యత కింద నిర్ణయమయ్యే అవకాశం కనిపిస్తోంది. జాతీయ అవసరాలు ఒక వైపు, రాష్ట్ర సమీకరణాలు మరో వైపు. ఇప్పుడు అందరినీ తొలిచే ప్రశ్న ఒక్కటే. పార్టీ ఎవరికి అవకాశం ఇస్తుంది? సీనియార్టీకా? విధేయతకా? లేక పార్టీ అవసరాలకా? రాజ్యసభ సీట్ల భర్తీ కోసం ఏ ప్రమాణాలు తీసుకుంటారు అన్న చర్చ పార్టీలో కొనసాగుతోంది. రాష్ట్ర శాసనసభలో మొత్తం 119 మంది సభ్యులు ఉన్నారు. ఒక రాజ్యసభ సీటు గెలవాలంటే 40 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాంగ్రెస్‌కు తగిన సంఖ్యాబలం ఉంది. రెండు సీట్లు సులభంగా గెలుచుకునే పరిస్థితి ఉంది. ఈ రెండు సీట్ల కోసం పెద్ద సంఖ్యలో నేతలు ప్రయత్నాలు - మిగతా3లో

---

## రాజమహేంద్రవరం మృతుల కుటుంబాలకు

# రూ.10 లక్షలు సాయం



- అసెంబ్లీలో ప్రకటించిన సీఎం చంద్రబాబు
- కల్తీ పాల కారణంగా అనారోగ్యం బారిన పడిన ఘటనపై అధికారులతో సమీక్ష
- సీఎం సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్య శాఖ అధికారులు
- ఘటనపై వివరాలు తెలుసుకున్న సీఎం
- వరలక్ష్మి డెయిరీకి చెందిన కల్తీ పాల వల్లే పలువురు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది
- సెక్షన్ 194 కింద బాధ్యులపై కేసు నమోదు చేశాం

**అమరావతి**

రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్?లో స్థానికులు అస్వస్థతకు గురైన ఘటనపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. లాలాచెరువు ప్రాంతంలో నలుగురు చనిపోయారని, 8 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వరలక్ష్మి డెయిరీకి చెందిన కల్తీ పాల వల్లే పలువురు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. సెక్షన్ 194 కింద బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు. అంతకుముందు కల్తీ పాల కారణంగా అనారోగ్యం బారిన పడిన ఘటనపై జిల్లా - మిగతా3లో



## అసంఘటిత కార్మికులకు

# అండగా ఉంటాం

ఈ - శ్రమ్ పోర్టల్ లో 88.16 లక్షల కార్మికులు

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**అమరావతి**

అసంఘటిత కార్మికుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. అసంఘటిత కార్మిక రంగానికి సంబంధించి ఎమ్మెల్యే వాల్మీకి పార్థ సారథి అడిగిన ప్రశ్నకు మంత్రి సుభాష్ సోమవారం అసెంబ్లీలో సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ., ఇ - శ్రమ్ పోర్టల్ లో మొత్తం 88,16, 453 మంది అసంఘటిత కార్మికులు తమ సమాచారాన్ని నమోదు చేసుకున్నారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి పోర్టల్ లో 18,24,221 మంది తమ పేర్లను - మిగతా3లో

## యువత రాజకీయాల్లోకి..

# స్ఫూర్తి నిచ్చిన ఎర్రన్నాయుడు

ఆయన ఆశయాలు, విలువలు తనకు ఎప్పటికీ మార్గదర్శకం

ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు



**(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి23):**

ప్రజాసేవను ప్రాణంగా భావించిన మహోన్నత నాయకుడు కింజరాపు ఎర్రన్నాయుడు తనకు అన్నయ్యగానే కాదు, మార్గదర్శకుడిగా, జీవితానికి దిక్సూచిగా నిలిచారని వ్యవసాయ శాఖ మంత్రి కిం జరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శ్రీకాకుళం జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులతో కలసి ఎర్రన్నాయుడు విగ్రహానికి మంత్రి అచ్చెన్నాయుడు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కోసం నిస్వార్థంగా పోరాడిన ఆయన అడుగుజాడల్లో నడవడం తనకు గర్వకారణమని, అలాంటి మహానేతకు తమ్ముడిగా పుట్టడం తన జీవితంలో అత్యంత - మిగతా2లో

---

## రోడ్డు ప్రమాదాలు నివారణే

# పోలీస్ శాఖ లక్ష్యం

జర్నలిస్టులు హెల్మెట్ ధరించండి.. ఏడాదికి 500 రోడ్డు ప్రమాదాలు

వీధిన పడుతున్న కుటుంబాలు : అనంత జిల్లా ఎస్పీ పి జగదీష్

జర్నలిస్టుల ఉచిత హెల్మెట్ పంపిణీ బ్రోచర్ ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ జగదీష్

వచ్చేవారం జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఉచిత హెల్మెట్ పంపిణీ

మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్

APWJU

ANDHRA PRADESH WORIKING JOURNLIST UNION

**అంకుశం ప్రతినిధి అనంతపురం ఫిబ్రవరి 23**

అనంతపురం జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరూ హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాలు జరక్కుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క జర్నలిస్టు మీద ఉంది అని జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించాలన్నదే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు అనంతపురం జిల్లా అనంతపురం నగరంలోని ఎస్పీ కార్యాలయం - మిగతా2లో






# రాజమహేంద్రవరం మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు సాయం

-మొదటిపేజీ తరువాయి

కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్య శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారు. అనారోగ్యం బారిన పడిన, మరణించిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం బాధితులకు అందుతున్న వైద్యసాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు వివరించారు. చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించాలని సీఎం సూచించారు. "కిమ్స్ ఆస్పత్రి సమాచారం ప్రకారం వాంతులు, కడుపునొప్పితో వచ్చారు. మూత్రం నిలిచిపోవడం, డయాలసిస్ సమస్యలతో ఆస్పత్రులకు వచ్చారు. వీరంతా లాలాచెరువు ప్రాంతంలోని చౌడేశ్వరీనగర్, స్వరూప్‌నగర్ వాసులు. క్లినికల్ పరీక్షల్లో రక్తంలో యూరియా, సీరం, క్రియాటిన్ స్థాయిలు పెరిగినట్లు గమనించారు. వెంటనే నమూనాలు తీసుకొని ల్యాబ్‌లకు పంపారు. కోరుకొండ మండలం నరసాపురం గ్రామంలోని వరలక్ష్మి మిల్క్ డెయిరీ నుంచి 106 మందికి పాల సరఫరా అయింది. వరలక్ష్మి మిల్క్ డెయిరీ నుంచి వచ్చిన పాలే ఈ అస్వస్థతకు కారణమని నిర్ధరించారు". - సీఎం చంద్రబాబు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో విక్రయదారులు 106 ఇళ్లకు పాలు పంపిణీ చేస్తున్నారని అధికారులు వివరించారు. పాలు వినియోగించిన కుటుంబాల్లోని 75 మంది నుంచి శాంపిల్స్ సేకరించామని అధికారులు తెలిపారు. మిగిలిన అందరి నుంచి శాంపిల్స్ తీసుకుంటున్నామన్నారు. పాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపామని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలతో పాటు ర్యాపిడ్ టెస్ట్ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని అధికారులు వివరించారు. ఫలితాల అనంతరం విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు రాజమహేంద్రవరం వెళ్లాలని ఆదేశించారు.

**ఇంటింటి సర్వే కొనసాగుతోంది:**

రాజమహేంద్రవరంలో అనూరియా (మూత్రం ఆగిపోవడం) మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్లు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వెల్లడించారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో కొంతమంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. ఆరోగ్యశాఖ, నగరపాలక అధికారులు ఇంటిటా సర్వే చేపట్టినట్లు క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. కల్తీ పాలన ఆరోపణల నేపథ్యంలో పాలు పోసే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. 42 మంది రైతుల నుంచి పాల సేకరణ జరుగుతోందని, పశువులు, వాటి ఆహారం శాంపిల్స్ సేకరించినట్లు కీర్తి చేకూరి చెప్పారు. పాల వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పాలు, పెరుగు శాంపిళ్లను ఫుడ్ సేఫ్టీ విభాగం సేకరించిందని అన్నారు. స్థానికుల్లో ఏ లక్షణాలున్నా కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ భరోసానిచ్చారు. ఏ లక్షణాలున్నా 94940 60060 ద్వారా కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చునని కలెక్టర్ తెలిపారు.

"ఇప్పటివరకు 73 శాంపిల్స్ సేకరించాం. ఇవాళ సాయంత్రానికి ఫలితాలు వస్తాయి. ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఎలాంటి లక్షణాలున్నా చికిత్స అందిస్తున్నాం. 42 మంది రైతుల నుంచి పాల సేకరణ జరుగుతోంది. పశువులు, వాటి ఆహారం శాంపిల్స్ సేకరించాం. పాలు, పెరుగు శాంపిళ్లను ఫుడ్ సేఫ్టీ విభాగం సేకరించింది. ఇప్పటివరకు నలుగురు మరణించారు. తాడి కృష్ణవేణి, తాడి రమణి, రాధాకృష్ణమూర్తి, శేషగిరిరావు మరణించారు. 8 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇంటింటికి వెళ్లి రక్త నమూనాల సేకరణ కొనసాగుతోంది." – కీర్తి చేకూరి, జిల్లా కలెక్టర్

నాలుగుకు చేరిన అనూరియా మృతులు: ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ ఇద్దరు మృతి చెందారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో ఆస్పత్రుల్లో పలువురికి చికిత్స చేస్తున్నారు. కలుషిత పాలు తాగి అస్వస్థతకు గురై బాధితులు ఆస్పత్రిలో చేరారు. రాజమహేంద్రవరం ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఘటన జరిగిన ప్రాంతాల్లో పాలు, నీరు, ఇతర నమూనాల సేకరణించారు. క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు అధికారులు ఏర్పాటు చేశారు. ఘటనపై ఆరోగ్యశాఖ, నగరపాలక అధికారులు ఇంటింటా సర్వే చేపట్టారు. శాంపిళ్ల సేకరణ జరుగుతోంది: ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించి సమీక్షలు చేస్తున్నామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపారు. పాలు సరఫరా చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. అనధికారికంగా నడుపుతున్న డెయిరీని సీజ్ చేశామని పేర్కొన్నారు. విజయవాడ నుంచి కూడా నిపుణులు వచ్చారని తెలిపారు. శాంపిళ్ల సేకరణ జరుగుతోంది. వాటి ఫలితాలు వచ్చాక మరిన్ని వివరాలు వస్తాయన్నారు.

# రోడ్డు ప్రమాదాలు నివారణే పోలీస్ శాఖ లక్ష్యం






-మొదటిపేజీ తరువాయి

నందు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఏపీ జర్నలిస్టు డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల ఉచిత హెల్మెట్ పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ప్రచార పోస్టర్ను జిల్లా ఎస్పీ పి జగదీష్ జిల్లాలోని ట్రైని ఐపీఎస్ అధికారి అశ్విని మణిదీప్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చ రామలింగారెడ్డి ప్రారంభించారు

జిల్లా పోలీస్ శాఖ తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ హెల్మెట్ ధరించాలి రోడ్డు ప్రమాదాలు నివారించాలి అనే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఇది అన్ని వర్గాలకు స్ఫూర్తినిస్తుందని వర్కింగ్ జర్నలిస్టులందరినీ అభినందిస్తున్నానని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని వాటిని తగ్గించాలని లక్ష్యంతో నో హెల్మెట్ నో పెట్రోల్ అనే కార్యక్రమాన్ని తీసుకున్నామని ప్రజల నుంచి స్పందన బాగున్నదని అది ఇంకా కొనసాగిస్తామని కొంత పని ఒత్తిడితో కొంత నిదానంగా జరుగుతున్నదని ఎస్పీ జగదీష్ అన్నారు

సంవత్సరానికి 500కు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యమని రోడ్డు ప్రమాదాల వల్ల చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని జిల్లా ఎస్పీ జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారుజిల్లాలో సరాసరి రోజుకి 40 నుంచి 50 మంది హెల్మెట్ లేకుండా ఉండడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని అది లేకుండా చూడాలన్నదే తమ ప్రయత్నమని ఎస్పీ జగదీష్ అన్నారు జిల్లాలోని ప్రజలు యువత అందరూ పోలీస్ శాఖకు సహకరించాలని అందరూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని అలా చేసినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చునని అది ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు

వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చ రామలింగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా అనంతపురం జిల్లాలో జిల్లా పోలీస్ శాఖ జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేక చొరవ చూపి ఒక్కరు హెల్మెట్ ధరించాలి అని ప్రజల్ని చైతన్యవంతులు చేస్తున్న కార్యక్రమానికి వర్కింగ్ జర్నలిస్టుగా మద్దతు ఇవ్వాలనేటువంటి ఉద్దేశంతో మేము కూడా జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టు అందరికీ వచ్చేవారం ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ జగదీష్ ని వర్కింగ్ జర్నలిస్టులు యూనియన్ గా అభినందిస్తున్నామని ఈ కార్యక్రమానికి వర్కింగ్ జర్నలిస్టుగా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రాబోవు రోజుల్లో కొనసాగిస్తామని ఎక్కువ జిల్లాల్లో ఉచితంగా హెల్మెట్లు ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ పంపిణీ చేస్తుందని వచ్చేవారం అనంతపురం జిల్లా నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడతామని అనంతపురం నగరంలో జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేస్తామని మచ్చా రామలింగారెడ్డి అన్నారు

ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు షాకీర్, వెంకటేష్, రమణారెడ్డి, దాదు నాయక్ జానీ, త్యాగరాజ్ ,వెంకట్ , మురళి, ప్రసాద్ పెద్ద ఎత్తున నగరంలోని జర్నలిస్టులు పాల్గొన్నారు

# జెన్ జీ టీమ్ తయారు చేస్తున్న జనసేన

**కాకినాడ :** ఒక్క సీటుతో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి.. చట్టసభల్లోకి అడుగు పెట్టింది జనసేన. ఏకంగా 21 సీట్లతో కింగ్ మేకర్‌గా కూటమిలో కొనసాగుతోంది. అయితే ఈ ఏడాదిన్నర కాలంగా ప్రభుత్వం, పాలనపైనే ఫోకస్ పెట్టిన జనసేనాని..ఇప్పుడు పార్టీ పటిష్టత కోసం సీరియస్ కాన్సన్‌ట్రేషన్ చేశారు. గ్రౌండ్ లెవల్‌లో క్యాడర్ బలోపేతం కోసం ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికంటే మరింత బలపడి టీడీపీ, వైసీపీతో సమానంగా స్ట్రాంగ్ ఫోర్స్‌గా నిలబడాలన్నది పవన్ వ్యూహంగా కనిపిస్తోంది. ఇంతకాలం పార్టీ బలోపేతంపై పెద్దగా ఫోకస్ చేయని పవన్..ఫ్యూచర్ పాలిటిక్స్‌ను దృష్టిలో పెట్టుకుని గ్రాస్ రూట్ లెవెల్ నుంచి రాష్ట్ర స్థాయి దాకా జనసేనను పటిష్టం చేయాలని డిసైడ్ అయ్యారట. పవర్‌లో ఉన్నాం కాబట్టి.. పార్టీని స్ట్రెంథెన్ చేసేందుకు ఇదే సరైన టైమ్ అని భావిస్తున్నారట.పవన్ కోసం పనిచేస్తున్న లక్షలాది మంది అభిమానులు ఉన్నారు. పార్టీకి అంతో ఇంతో క్యాడర్ ఉంది. కానీ సంస్థాగతంగా జనసేనకు బలమైన పునాదులు లేవు. గ్రామ, మండల, జిల్లా కమిటీలు స్ట్రాంగ్‌గా లేని పరిస్థితి. పైగా పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై.. వైసీపీ, టీడీపీ వెంట నడుస్తున్నట్లుగా జనసేనకు బ్యాక్ బోన్‌గా నిలుస్తున్న ఫిక్స్‌డ్ ఓటర్లు కూడా లేరు. ఇప్పటికే ఓటర్లుగా ఉన్న వారిలో మెజార్టీ ప్రజలు పార్టీల వారీగా విడిపోయిన పరిస్థితి. ఏ పార్టీకి సంబంధం లేని వారు పరిస్థితులను బట్టి..ఓసారి వైసీపీకి, మరోసారి టీడీపీకి మద్దతు తెలుపుతుంటారు. అయితే జనసేనకు కూడా వైసీపీ, టీడీపీ లాగా ఒక బలమైన వర్గాన్ని వెన్నుముకగా మార్చుకోవాలన్నది పవన్ ఆలోచన అంటున్నారు. జెన్ జీ సెంట్రిక్‌గా పాలిటిక్స్ చేస్తూ.. 20, 25 ఏళ్లలోపు వారిని జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులు అయ్యేలా చేయాలనేది పవన్ వ్యూహమంటున్నారు.రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే పవన్ స్ట్రాటజీ సిద్ధం చేస్తున్నారట. పార్టీలో యువ



నాయకత్వాన్ని ప్రోత్సహించాలని, జెన్ జీ ఆలోచనలను అర్థం చేసుకోవాలని లీడర్లకు నొక్కి చెప్తున్నారట పవన్. కూటమితో సమన్వయం, యువత ఆకాంక్షలు, ప్రజలతో సన్నిహిత సంబంధాలతో జనసేన మరోసారి ప్రభంజనం సృష్టించేలా పవన్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారట. ప్రత్యేకంగా జెన్ జీ తరం సరికొత్తగా ఆలోచిస్తోందని..వారిని పార్టీకి దగ్గర చేయాలనేది సేనాని ఆలోచనగా చెబుతున్నారు.జెన్ జీ అన్నది ఇప్పుడు వరల్డ్ వైడ్‌గా హాట్ టాపిక్‌గా ఉంది. పలు దేశాల్లో ప్రభుత్వాల తీరు నిరసిస్తూ తిరుగుబావుటా ఎగరవేస్తూ జెన్ జీ సత్తా చాటుతోంది. యువ కెరటాలై కన్నెర్ర చేస్తూ ప్రభుత్వాలకు వణకు పుట్టిస్తున్నారు. ఈ మధ్య దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు జెన్ జీ గురించే ఎక్కువగా మాట్లాడుతున్నాయి. దేశంలోని జెన్ జీ నిర్మాణాత్మకమైనదని ఇటీవలే ప్రధాని మోదీ కూడా కామెంట్స్ చేశారు. 1997 నుంచి 2012 మధ్య జన్మించిన జనరేషన్‌ను జెన్ జీగా పిలుస్తారు. సోషల్ మీడియా వేదికల ద్వారా రూపుదిద్దుకున్న మొదటి నిజమైన డిజిటల్ తరంగా చెబుతారు. అలాంటి జెన్ జీలను తమ వైపునకు తిప్పుకోవాలనేది జనసేన ప్రత్యేక కార్యాచరణగా ఉంది.ఏపీ రాజకీయాల్లో..అయితే టీడీపీ లేకపోతే వైసీపీ అన్నట్లుగా పరిస్థితి ఉంది. ఏపీలో థర్డ్ ఫోర్స్‌గా జనసేన దూసుకుని రావడానికి ఇదే సరైన సమయమని..అందుకు యువతను ఆయుధంగా మల్చుకోవాలనేది పవన్ ప్లాన్‌గా చెబుతున్నారు. టీడీపీకి ఎప్పటి నుంచో బలమైన క్యాడర్ గ్రౌండ్ లెవల్ వరకు ఉంది. విపక్షంలో ఉన్న వైసీపీకి కూడా చెప్పుకోదగ్గ బలమే ఉంది. అయితే ఫ్యాన్ పార్టీ క్యాడర్, లీడర్లలో ఉన్న స్తబ్దతను తమ పార్టీ ఎదుగుదలకు అనువుగా మార్చుకోవాలని జనసేన చూస్తోందట. 2029 ఎన్నికల నాటికి ఏపీలో మూడో అతి పెద్ద పొలిటికల్ ఫోర్స్‌గా నిలబడాలనే ప్లాన్‌తో జెన్ జీకి ఆకర్షించేలా పావులు కదుపుతున్నారట. అంతకంటే ముందే లోకల్ బాడీ ఎన్నికల్లో తన సత్తాను చాటితే..వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేలను గెలిపించుకోవడం ఈజీ అవుతుందని లెక్కలు వేసుకుంటున్నారట.స్థానిక సంస్థల్లో, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో యువతకు అవకాశం ఇచ్చి రోల్ మోడల్‌గా నిలవాలన్నది జనసేన ప్లాన్ అంటున్నారు. 20, 25 ఏళ్లలోపు యువకులను తమ పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షిస్తే..తమకు సాలిడ్ ఓట్ బ్యాంకు ఉండటమే కాదు..పార్టీకి బలమైన పునాదులు పడుతాయని భావిస్తున్నారట. భవిష్యత్ అంతా యువతే కాబట్టి..పైగా జెన్ జీ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసేలా..జెన్ జీల సెంట్రిక్‌గా ఫ్యూచర్ ప్లాన్లు తయారు చేస్తున్నారట.ఓవైపు వైసీపీ వీక్ అయిన చోట తాము ఆల్టర్నేట్‌గా బలపడాలనే స్కెచ్‌తో పాటు..మిగతా పార్టీలతో సమానంగా తమకు డెడికేటెడ్ ఓటు బ్యాంకును తయారు చేసుకునే స్కెచ్ వేస్తున్నారట. జనసేన ప్రజల కోసం పనిచేస్తుందని..ఆ పార్టీలోకి వెళ్తేనే రాజకీయ అవకాశాలు దక్కుతాయని యువతకు నమ్మకం కలిగించేలా సరికొత్త మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తున్నారట. జెన్ జీస్‌ను అట్రాక్ట్ చేసేలా పవన్ వేస్తున్న వ్యూహాలు ఎంత వరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

## అసంఘటిత కార్మికులకు అండగా ఉంటాం

-మొదటిపేజీ తరువాయి

నమోదు చేసుకున్నారని చెప్పారు. వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల నమోదును వేగవంతం చేస్తున్నామన్నారు. కార్మికుల ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అసంఘటిత కార్మికులకు ఉచిత వైద్య సేవలతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని కార్మిక శాఖ మంత్రి సుభాష్ స్పష్టం చేశారు. ప్రసూతి సహాయం కోసం రూ.20,000., వివాహ కానుక కింద రూ.40,000., సాధారణ మరణం సంభవిస్తే రూ.60,000., సహాయం చేయడంతో పాటు అంత్యక్రియల ఖర్చులకు తక్షణమే రూ.20,000., ఆర్థిక సహాయం చేస్తున్నామని మంత్రి వివరించారు. అదే విధంగా 1వ తరగతి నుంచి 12వ తరగతి చదివే నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్ పథకం కూడా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాలతో సంబంధం లేకుండా భవన నిర్మాణ కార్మికులు వివిధ పనుల్లో నిమగ్నమై ఉండటంతో పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. అసంఘటిత కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సుభాష్ అసెంబ్లీలో స్పష్టం చేశారు.

## ఏమాత్రం మారని వైఎస్సార్సీపీ సభ్యుల తీరు

-మొదటిపేజీ తరువాయి

చేశారు. పెద్దఎత్తున ఆందోళన చేస్తోన్న సభ్యులను పిలిచిన ఛైర్మన్ ఫుటేజీ ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

**ప్రత్యేక అంశాల ప్రస్తావనకు అవకాశం**

ఇదే సమయంలో వరుసగా 5 రోజుల పాటు సభా కార్యకలాపాలు నిలిచిపోవడం, సభలో వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళన చేస్తోన్న దృష్ట్యా సభా కార్యకలాపాల నిర్వహణ కోసం మండలి బీఏసీ సమావేశమైంది. ఛైర్మన్ కొయ్యే మోషను రాజు అధ్యక్షతన సమావేశంలో సభలో ప్రజా సమస్యలపై చర్చించడంపై చర్చించారు. ఈ నెల 26న మండలిలో తిరుమల కల్తీ లడ్డూపై చర్చించాలని నిర్ణయించారు. అదే విధంగా వ్యవసాయం, లా అండ్ ఆర్డర్ తదితర సమస్యలపై స్వల్పకాలిక చర్చ జరపాలని నిర్ణయించారు. అనంతరం 1.45 గంటలకు సభ ప్రారంభం కాగా సభ్యులు ప్రత్యేక అంశాల ప్రస్తావనకు ఛైర్మన్ అవకాశం కల్పించారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలతో చనిపోయిన ఘటనలపై హోం మంత్రి సభలో స్టేట్?మెంట్ ఇచ్చారు. ఘటనను ఖండించిన హోం మంత్రి కల్తీ పాల ఘటనపై ప్రభుత్వం దర్యాప్తు జరుపుతోందని బాధ్యులపై చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. హోం మంత్రి సమాధానం అనంతరం మండలి రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. ఆ ఆరోపణలు అవాస్తవం: ఈ సందర్భంగా మండలిలో ఎమ్మెల్సీ బొత్స మాట్లాడుతూ తిరుమల లడ్డూ కల్తీపై ఈ నెల 26న మండలిలో చర్చించాలని నిర్ణయించారని అలానే 24న లా అండ్ ఆర్డర్, 25న వ్యవసాయంపై చర్చిస్తారని తెలిపారు. సాగునీటిపారుదల, విద్య, పెట్టుబడులపైనా చర్చకు ప్రభుత్వం అంగీకరించిందని బొత్స తెలిపారు. ఇటీవల వైఎస్సార్సీపీ సభ్యులు చెప్పులు వేసుకుని వేంకటేశ్వర స్వామి ఫొటోలు పట్టుకున్నారనే ఆరోపణలు అవాస్తవమని చెప్పారు. ఒరిజినల్ వీడియో ఫుటేజీ ఇచ్చేందుకు ఛైర్మన్ సమ్మతించారని వెల్లడించారు.

## టీటీడీ నిబంధనలు మరింత కఠినతరం

-మొదటిపేజీ తరువాయి

టీటీడీ నిబంధనలు ప్రకారం అన్యమతస్థులు శ్రీవారి దర్శనం చేసుకోవాలంటే డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

**స్వర్ణ దేవాలయం తరహాలో**

తిరుమలలోనూ స్వర్ణ దేవాలయం తరహాలో చట్టాన్నీ తీసుకొచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అమృతసర్‌లో స్వర్ణ దేవాలయానికి ఉన్న ప్రత్యేక చట్టం ద్వారా తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అధికారం ఉంది. అటువంటి చట్టాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంకు కూడా తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ చర్యలు తీసుకునే వెసులుబాటు కల్పించే దిశగా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. స్వర్ణ దేవాలయం చట్టాన్ని వెంటనే అధ్యయనం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

**రేపు అసెంబ్లీలో పెడతాం**

తిరుమల లడ్డూ కల్తీకి సంబంధించి వాస్తవాలన్నీ రేపు అసెంబ్లీలో పెడతామని అసెంబ్లీ లాబీలో మీడియాతో నిర్వహించిన చిట్ చాట్?లో మంత్రి నారా లోకేశ్ చెప్పారు. దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగానే బయటపెడతామని అన్నారు. అసెంబ్లీకి రమ్మని ఎవ్వరూ బొట్టుపెట్టి పిలవరని ఎద్దేవాచేశారు. సభకు రావటం సభ్యులుగా వారి బాధ్యత అని గుర్తుచేశారు. దేవుడిని కూడా వైఎస్సార్సీపీ రోడ్డు మీదకు తీసుకురావవటం బాధాకరమైన విషయమని మండిపడ్డారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు ఆక్షేపణీయమని మంత్రి లోకేశ్ అన్నారు.

**అదే తీరు**

మరోవైపు శాసనమండలిలో వైఎస్సార్సీపీ తీరు మారలేద. హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా ఉన్న ఇందాపూర్ డెయిరీ ద్వారా టీటీడీకి నెయ్యి సరఫరా చేయడంపై శాసన మండలిలో చర్చించాలని మండలిలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు వరుసగా ఐదో రోజు ఆందోళనకు దిగారు. ఇవాళ సభలో చర్చించాలని వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు వరుసగా ఐదోరోజు వాయిదా తీర్మానం ఇవ్వగా దాన్ని మండలి ఛైర్మన్ తిరస్కరించారు. ప్లకార్డులు పట్టుకుని పోడియంను చుట్టు ముట్టి వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. ఆందోళనల మధ్యే ప్రశ్నోత్తరాలను మండలి ఛైర్మన్ చేపట్టారు. వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళన ఉధృతం చేయడం, సభలో గందరగోళం నెలకొనడంతో సభను కాసేపు వాయిదా వేశారు. వరుసగా ఐదు రోజుల పాటు సభా కార్యకలాపాలు నిలిచిపోవడం, సభలో వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళన చేస్తున్న దృష్ట్యా సభా కార్యకలాపాల నిర్వహణ కోసం మండలి బీఏసీ సమావేశమైంది. ఛైర్మన్ కొయ్యే మోషను రాజు అధ్యక్షతన సమావేశంలో సభలో ప్రజా సమస్యలపై చర్చించే విషయమై కూటమి, వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు చర్చించారు.

## యువత రాజకీయాల్లోకి.. స్ఫూర్తి నిచ్చిన ఎర్రన్నాయుడు

-మొదటిపేజీ తరువాయి

అదృష్టమని భావోద్వేగంతో పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం, నిబద్ధత, ప్రజాహితం పట్ల అంకితభావం ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆయన ఆశయ సాధనకే తన ప్రతి శ్వాస అంకితం చేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఎర్రన్నాయుడు నాయకత్వంలో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందన్నారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యా, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయ మని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపడంలో ఆయన ప్రత్యేక శైలి ఉండేదని గుర్తుచేశారు. ఢిల్లీలో ఉత్తరాంధ్ర స్వరంగా అభివృద్ధి కోసం ఎర్రన్నాయుడు గళం విప్పారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి న్యాయం జరగాలనే దృఢ సంకల్పంతో ఆయన పోరాడారని చెప్పారు. కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలోనూ ప్రజా సంక్షేమాన్ని ముందుంచుకుని నిర్ణయాలు తీసుకున్న నాయకుడని కొనియాడారు.ఎర్రన్నాయుడు నాయకత్వం స్ఫూర్తిగా తీసుకుని ఎంతో మంది యువకులు రాజకీయాల్లోకి వచ్చారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే తపన, నిబద్ధత, నిజాయితీ ఆయన వ్యక్తిత్వంలో అంతర్లీనంగా ఉన్నాయని చెప్పారు. ఆయన చూపిన మార్గం ఈ తరానికి ఆదర్శమని అభిప్రాయ పడ్డారు. శ్రీకాకుళం ముద్దుబిడ్డగా గల్లీ నుండి ఢిల్లీ వరకు ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత శ్రీకాకుళం జిల్లా ఒక కొత్త దిశలో ముందుకెళ్లింది. అభివృద్ధి అంటే ఏమిటో, ప్రజాసేవ అంటే ఏమిటో తన జీవితంతో చూపించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రజల సంక్షేమం కోసం, రైతాంగం కోసం, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు అని అన్నారు. రైతులకు సాగునీరు అందించాలనే తపనతో అహర్నిశలు శ్రమించారు. ఆయన ఆశయ సాధనే మన లక్ష్యం. శ్రీకాకుళం అభివృద్ధే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, బెందాలం అశోక్, గొండు శంకర్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, ఎన్ . ఈశ్వర్ రావు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం నాణ్యతగా ఉండాలి

**- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 23 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అర్జీలను స్వీకరించారు.

జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు కేశవనాయుడు, ఏబీవీఎస్బి శ్రీనివాస్, వసంతబాబు, ఎస్డీసిలు రామ్మోహన్, పద్మావతి, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్జీదారులతో జిల్లా కలెక్టర్ సావధానంగా మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులోభాగంగా ప్రజల నుంచి 696 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.



- ఈ సందర్భంగా ఓ ఆనంద్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారం అత్యంత నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. ప్రత్యేక దృష్టి పెట్టి అర్జీలకు పరిష్కారం చూపించాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ అర్జీలను పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని, అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా వారితో మాట్లాడి అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

- ఈ కార్యక్రమంలో ఎస్డీసి మల్లికార్జున, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డిపిఓ నాగరాజునాయుడు, ఆర్డబ్ల్యుఎస్



ఎస్ఈ సురేష్, డ్వామా పిడి సలీమ్ భాష, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్బరాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి రవి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, జిల్లా రిజిస్టర్ భార్గవ్, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, సర్వే ఏడి రూప్ల నాయక్, డిసిఓ అరుణకుమారి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, హౌసింగ్ పిడి శైలజ, మైన్స్ డిడి ఆదినారాయణ, ఎల్డిఎం నరేష్ రెడ్డి, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు రియాజుద్దీన్, వసంతలత, యుగేశ్వరిదేవి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ మాస సందర్భంగా

# జిల్లా కలెక్టర్ ని కలిసిన షకీల్ సఫీ

**- నగరంలో ముస్లిం సమస్యలు పరిష్కరించండి**
**- అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాం**
**- జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్**

**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 23 :**జిల్లాలోని ముస్లిం సమస్యలు పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులను పంపించి న్యాయం చేస్తామని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు .పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈరోజు రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షులు కె.యం. షకీల్ సఫీ నేతృత్వంలో ముస్లిం మత పెద్దలు మరియు ప్రముఖులు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ని కలిసి ముస్లిం సమస్యలపై షకీల్ షఫీ కలెక్టర్కు వివరించారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న నమాజ్ కట్ట (ఈద్గా



మస్జిద్) రోడ్డు విస్తరణ (Road Widening) మరియు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కలెక్టర్ గారితో చర్చించడం జరిగింది. ఈ విషయం పై సంబంధించి అధికారులతో చర్చించి తన నిర్ణయాన్ని తెలియజేస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో



అడ్వకేట్ రెహమాన్ గారు, అంగడి ఇషాక్ ,రిటైర్డ్ ఈడి తాజు, పూల భాష, ప్రభుత్వ ఖాజీ జాహిద్ హుస్సేన్,కట్టుబడి బాబాజీ, ఐఎంఎం మహబూబ్ బాషా, డాన్ సాదిక్ , హెల్పింగ్ హాండ్స్ షబ్బీర్, షేక్ నూర్ బాబా, షేక్ షాకీర్ మరియు ఇమాములు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## హిజ్రాలకు ఐడి కార్డుల పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్



**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 23 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం అనంతపురంకు చెందిన యస్.శాంతి, కూడేరుకు చెందిన హెచ్.ఆద్యా అనే ఇద్దరు హిజ్రాలకు ఐడి కార్డులను మరియు హిజ్రా సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న హిజ్రాలు అందరికి తక్షణమే ఐడి కార్డులు మంజూరు కాబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, సిబ్బంది పాల్గొన్నారు.

## పాడి రైతుల కోసం గోకులం షెడ్ల నిర్మాణం

**–టీడీపీ మండల ఇంచార్జి ధర్మవరపు మురళీ**



**రాప్తాడు, అంకుశం న్యూస్, ఫిబ్రవరి 23:** మండలంలో పాడి రైతుల అభివృద్ధి కోసం టిడిపి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత సోదరుడు, టీడీపీ మండల ఇంచార్జి ధర్మవరపు మురళీ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం కింద రూ.2.30లక్షల అంచనా వ్యయం ఉండగా 90శాతం సబ్సిడీతో కుమ్మర మల్లికార్జున, సుబ్బరత్నమ్మ దంపతులు నిర్మించుకున్న గోకులం షెడ్డును సోమవారం అయన డ్వామా విజిలెన్స్ అధికారి జల్లా శ్రీనివాసులు, ఎంపీడీఓ బి.విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓలు అశోక్ బాబు, అచ్యుతానందబాబు, మండల కన్వీనర్ పంపు కొండప్ప, సర్పంచ్ సాకే తిరుపాలుతో కలిసి ప్రారంభించారు. మురళీ మాట్లాడుతూ. గోకులం షెడ్లు పశువులకు రక్షణ, పాల ఉత్పత్తిని పెంచడానికి, మూగజీవాలకు నీడ, వాన, ఎండ నుండి రక్షణ కల్పిస్తూ పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సావిత్రి, ఈసీ మురళీ, టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లు హజారా, తలారి శివ, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జాప్యం లేకుండా నిర్ధేశిత సమయంలో పరిష్కరించండి

**- జిల్లా ఎస్పీపి.జగదీష్**
**- జిల్లా పోలీస్ కార్యాలయం లో 123 పిటీషన్లు స్వీకరణ**
**- పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసిన జిల్లా ఎస్పీ జగదీష్**
**- ఇస్కాన్ సహకారంతో ఉచిత భోజన సదుపాయం**



**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 23 :** అనంతపురం జిల్లాలో పోలీస్ శాఖ నిర్వహించు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వచ్చే పిటిషన్లలో జాప్యం లేకుండా వెంటనే పరిష్కారం చూపాలని పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ పోలీస్ అధికారులకు ఆదేశించారు అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఈరోజు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్




(PGRS) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జగదీష్ ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటిని తక్షణమే పరిశీలించి చట్టపరిధిలో పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా...ఈ కార్యక్రమానికి హాజరైన పిటిషనర్లు మరియు వారి వెంట వచ్చిన వారికి ఇస్కాన్ సంస్థ వారి సహకారంతో ఉచిత భోజన ఏర్పాట్లు చేయడం జరిగింది. పోలీసు అధికారులు పాల్గొని స్వయంగా వారే భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ప్రజలు జిల్లా పోలీస్ యంత్రాంగానికి మరియు ఇస్కాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి అశ్విని మణిదీప్,అనంతపురం మహిళా డీఎస్పీ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్లో ప్రజలకు సేవలపై అవగాహన

**రాప్తాడు, అంకుశం న్యూస్, ఫిబ్రవరి 23:** పోలీస్ స్టేషన్లో ప్రజలకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ యాప్ ద్వారా 87 రకాల సేవలు అందిస్తామని సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీహర్ష తెలిపారు. గోళ్లపల్లి వద్ద ఉన్న మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల విద్యార్థులకు సోమవారం సీఐ శ్రీహర్ష అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడానికి ఎఫ్.ఐ.ఆర్ (ప్రథమ సమాచార నివేదిక) నమోదు, ఫిర్యాదుల స్వీకరణ, పోగొట్టుకున్న వస్తువులు, వ్యక్తుల ఆచూకీ, వివిధ రకాల ధృవీకరణ పత్రాలు తదితర సేవలు ఉంటాయన్నారు.



నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు ఇవ్వడం, ఎఫ్.ఐ.ఆర్ నకలు ఉచితంగా పొందడం, ఎవరి పైనైనా ఎలాంటి కేసులు తమపై లేవని పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్, పోగొట్టుకున్న వస్తువులు, మొబైల్ ఫోన్లు, వాహనాలు, లేదా వ్యక్తులు తప్పిపోతే రిపోర్ట్ చేయడం, లౌడ్స్పీకర్లు, ఊరేగింపులు, మీటింగ్లకు అనుమతి పొందడం, సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులను నమోదు చేయడం ఉంటాయన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ ఉల్లంఘనల జరిమానాల సమాచారం, చెల్లింపులు. అత్యవసర సహాయం కింద 100 లేదా 112 డయల్ చేయడం ద్వారా తక్షణ సహాయం పొందడం వంటి సేవలు పోలీస్ స్టేషన్లో అందుతాయన్నారు.

## బిసిల అభ్యున్నతికి ఐలాపురం వెంకయ్య చేసిన సేవలు చిరస్మరణీయం

**ఐలాపురం వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ కేశినేని శివనాథ్**





**అంకుశం ప్రతినిధి విజయవాడ : ఫిబ్రవరి 23:** ఇటీవల మృతి చెందిన ప్రముఖ బీసీ నాయకుడు, వ్యాపారవేత్త, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య (96) కుటుంబ సభ్యుల్ని ఎంపీ కేశినేని శివనాథ్ సోమవారం పరామర్శించారు. దుర్గా అగ్రహారంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆయన కుమారులు ఐలాపురం రాజ, ఐలాపురం అరుణ్ కుమార్ లతో పాటు ఇతర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియపర్చి,ఐలాపురం వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా వ్యాపారవేత్తగా హోటల్ రంగంలో, బీసీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీగా ఆయన చేసిన సేవలను ఎంపీ కేశినేని శివనాథ్ కొనియాడారు. బీసీ వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా అర్బన్ ఎన్.ఐ.ఆర్.డి కో–ఆర్డినేటర్ వల్లభనేని నరసింహాచౌదరి, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి.ఎన్.ఎస్.ఎఫ్ ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీపి.జగదీష్

**- విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడండి**
**- జిల్లా ఎస్పీ పి జగదీష్**





**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 23 :** ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత పరీక్షల అధికారులకు జిల్లా ఎస్పీ పి జగదీష్ సూచించారు అనంతపురం నగరంలో ఇంటర్ పరీక్ష కేంద్రాలను పరిశీలించి జిల్లా ఎస్పీ జగదీష్ తనిఖీ చేశారు. అనంతపురం నగరంలోని సాయిబాబా జూనియర్ కాలేజ్ నందుజిల్లా ఎస్పీ పి.జగదీష్ అనంతపురంలోని పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ఎస్ ఎస్ బి ఎన్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ విధానాలను సమీక్షించారు. పరీక్ష కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ప్రశ్నాపత్రాల భద్రపరిచే విధానం, హాల్ సూపరింటెండెంట్లు మరియు ఇన్విజిలేటర్ల విధులు తదితర అంశాలను ఎస్పీ జగదీష్ పరిశీలించారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, మాల్ ప్రాక్టీస్, గుంపులుగా తిరగడం వంటి చర్యలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. అలాగే... పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు, అనవసరంగా గుంపులు గూడకుండా చర్యలు, ఫోటోకాపీ సెంటర్లు మరియు జిరాక్స్ దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ జగదీష్ సంబంధిత అధికారులకు సూచించారు.

## పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు

**- జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**



**అంకుశం న్యూస్ పుట్టపర్తి ఫిబ్రవరి 23 :**శ్రీ సత్య సాయి జిల్లాలో మద్యం దుకాణాలు పారదర్శకంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయించడం జరిగిందని సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. జిల్లా కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ లియం.మౌర్య భరద్వాజ్ఐగారి పర్యవేక్షణలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ఎక్సైజ్ అధికారులు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది మరియు దరఖాస్తుదారుల సమక్షంలో ఈ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారం, అత్యంత పారదర్శక వాతావరణంలో నిర్వహించామని తెలియజేశారు. సి.కె. పల్లి దుకాణానికి కేవలం ఒకే దరఖాస్తు రావడంతో, దరఖాస్తుదారుడు గంగాధర్ నాయుడు పేరును అధికారికంగా ఖరారు చేశారు.

ఈ కార్యక్రమమ్ లో జిల్లా ఎక్సైజ్ అధికారి గోవింద నాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ ఆఫీసర్ బి. నరసింహులు,టాస్క్ ఫోర్స ఇన్స్పెక్టర్లు,పుట్టపర్తి ఎక్సైజ్ అధికారి ఉమామనోహర్ రాజు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## 'స్వర్ణ ఆంధ్ర 2047' క్యాలెండర్ను ఆవిష్కరించిన జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



**అంకుశం న్యూస్ పుట్టపర్తి ఫిబ్రవరి 23:** జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ నందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణ ఆంధ్ర 2047' విజన్ ప్రణాళికలో భాగంగా రూపొందించిన నూతన క్యాలెండర్ను జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఆ దిశగా జిల్లా యంత్రాంగం మరియు ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి,ఎస్డిసి రామసుబ్బయ్య,పిడి డిఆర్ డిఏ నరసయ్య జిల్లా అధికారులుపాల్గొన్నారు

# జైన్ సాధువుల ఆశీస్సులు పొందిన ఎంపీ కేశినేని శివనాథ్





**– జైన్ తేరాపంత్ భవన్ కు జైన్ సాధువులు రష్మీమునిశ్రీ, శివయుష్ మునిశ్రీ రాక**

**అంకుశం ప్రతినిధి విజయవాడ: ఫిబ్రవరి 23:** గురునానక్ కాలనీలోని జైన్ తేరాపంత్ భవన్‌కు విచ్చేసిన జైన్ తేరాపంత్ ఆచార్య మహాశ్రమణ్ శిష్యులు రష్మీమునిశ్రీ, శివయుష్ మునిశ్రీలను సోమవారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. రాజస్థాన్ నుంచి దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తూ విజయవాడకు చేరుకున్న జైన్ సాధువులను ఎంపీ కేశినేని శివనాథ్ జైన్ తేరాపంత్ భవన్‌లో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాధువులు అహింస, సద్గుణాలు, దురాలవాట్ల నివారణపై ఆధ్యాత్మిక బోధనలు అందించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సమాజంలో నైతిక విలువల పెంపొందనకు జైన్ సాధువుల సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. వారి పాదయాత్రలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంచుతున్నాయని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో జైన్ సమాజ ప్రముఖులు దినేష్ జైన్, శ్యామ్ సుఖా, జగదీష్ జైన్, మనోజ్ పుగ్లియా, రాజ్‌కుమార్ బైడ్, సంగీత దుగర్, సందీప్ కోఠారి, టిడిపి నాయకులు పీతా బుజ్జిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పీవీ సునీల్ కుమార్ సస్పెండ్ ను వెంటనే ఎత్తి వేయాలి !

**– కూటమి పాలనను బహుజన ప్రజలు రద్దు చేస్తారు.**

**– రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులుడా. పోతుల నాగరాజు**

**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 23:** రాష్ట్రంలో రెండు కుటుంబాలు, రెండు పార్టీ ల, రెండు కులాల ఆధిపత్య పోరులో బలి అవుతుంది దళిత, గిరిజన, బలహీన వర్గాల కు చెందిన అధికారులు, ప్రజలు, మీకు ఓట్లు వేసిన పాపానికి మమ్మల్ని బలి చేస్తున్నారా? అని రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ పోతులనాగరాజు నిలదీశారు వెంటనే డిజిపి సీనియర్ ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్ సస్పెండ్ ను ఎత్తివేయాలని నాగరాజు డిమాండ్ చేశారు

ఒక వైపు వేల కోట్ల అవినీతి, అక్రమాలు చేసేది మీరు, కేవలం ప్రభుత్వం ఆదేశాలు అమలు చేసిన పాపనికి అధికారి డీజీపీ పీవీ సునీల్ కుమార్ గారిని వేయించడము ఎంత వరకు సమంజసం ఇప్పటికే అనేక మంది పోలీస్ అధికారులు ఎలాంటి పోస్టింగ్ లేక గత 20నెలలుగా ఇబ్బంది పడుతున్న విషయం పాలకులకు తెలియదా? మీ రెడ్ బుక్ రాజ్యాంగం ఒక వైపు రాజారెడ్డి రాజ్యాంగం మరొక వైపు అమలు కోసం ఎవరు అధికారంలో ఉంటే వారు ఆ అధికారులను అది దళిత ,గిరిజన, బలహీన వర్గాలకు చెందిన వారే బలి అవుతున్నారు. 20 నెలల పాలన లో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలు ఇసుక, మధ్యం, కల్తీ నెయ్యి, విద్యుత్ అవినీతి, పరకా మణి నిధులు అక్రమాలు, తిరుమల



దర్శనం టోకెన్స్ లో అవినీతి ఇలా వేల కోట్ల అవినీతి కి పాల్పడుతున్నారని సిట్ లు, సిబిఐ విచారణ జరుగుతున్న వారిపై ఎలాంటి చర్యలు లేకుండా, కేవలం ప్రభుత్వం ఆదేశాలు పాలకుల ఆదేశాలు అమలు చేసిన అధికారులను ఇలా వేదించడం ఎంత వరకు సమంజసం అని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డా. పోతుల నాగరాజు కుటమి ప్రభుత్వంను డిమాండ్ చేస్తూ, వెంటనే పీవీ సునీల్ కుమార్ గారి సస్పెన్సు ను ఎత్తి వేయాలి అని లేకపోతే కుటమి ప్రభుత్వం ను భవిష్యత్తు లో అధికారం కు దూరం చేయడానికి బహుజన సమాజం కృషి చేస్తుంది అని హెచ్చరిక చేస్తున్నాము.

# ఎంప్లాయిమెంట్ జనరేట్ చేసే స్థాయిలో శిక్షణ ఉండాలి

**– టిటిడి జేఈవో (వైద్యం & విద్య) డా. ఎ. శరత్**

**అంకుశం న్యూస్ తిరుపతి ఫిబ్రవరి 23:** తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు ఉద్యోగావకాశాలు సృష్టించే స్థాయిలో నాణ్యమైన శిక్షణ అందించాలని టిటిడి జేఈవో (వైద్యం & విద్య) డా. ఎ. శరత్ అధ్యాపకులకు సూచించారు. సోమవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి కళాశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కెరీర్ గైడెన్స్, నాణ్యమైన ఫలితాలు, ఉపాధి అవకాశాల సాధన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాల కావడంతో సాంకేతిక నైపుణ్యాభివృద్ధి (టెక్నికల్ స్కిల్స్) పై మరింత శ్రద్ధ అవసరమని తెలిపారు. తరచూ కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థినుల్లో ప్రేరణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని చెప్పారు. విద్యార్థినుల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలంటే అధ్యాపకులు సమిష్టిగా కృషి చేయాలని, నాణ్యమైన ఫలితాలు సాధించేందుకు



కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఉత్తీర్ణత శాతం తగ్గితే సంబంధిత అధ్యాపకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అంతకుముందు జేఈవో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ప్రాక్టికల్ ల్యాబ్‌లు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులతో ముచ్చటించారు. మైండ్ అటెన్షన్‌తో చదువుకుంటేనే ఉన్నత స్థాయి కెరీర్ సాధ్యమవుతుందని వారికి సూచించారు. టిటిడి నుంచి పూర్తి సహకారం అందుతోందని, అందుకు తగిన విధంగా ప్రతిభను



కనబరచాలని విద్యార్థినులను కోరారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి కళాశాలలో ఉన్న లోటుపాట్లను తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా. ఎం. పద్మావతమ్మ, అదనపు హెల్త్ ఆఫీసర్ డా. సునీల్, ఈఈ ప్రసాద్, డీఈ శ్రీమతి సరస్వతి, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సంపూర్ణ అక్షరాస్యతే అక్షరాంధ్ర లక్ష్యం

**– : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 23 :** జిల్లాకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని 100 శాతం అక్షరాస్యులుగా మార్చడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో అక్షర ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్స్ లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యతే అక్షరాంధ్ర లక్ష్యం అని, ఈ ఏడాది జిల్లాలో 1,25,578 మందిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం అన్నారు. ముఖ్యంగా జిల్లా / మండల / గ్రామ / వార్డు అధికారులందరూ అక్షర కేంద్రాలను సందర్శించి హాజరు శాతాన్ని పెంచి కార్యక్రమం సజావుగా నడిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 28 న జరిగే ప్రీ ఫైనల్ పరీక్ష మరియు మార్చి నెలలో జరిగే ఖీమీచీూ పరీక్షకు అందరు అభ్యాసకులు ఉత్తీర్ణులు కావాలని, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, వయోజన విద్య ఉప సంచాలకులు సంపంగి వెంకటేశ్వర్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 2026కు సంబంధించిన స్వర్ణాంధ్ర ఏ 2047 క్యాలెండర్ లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 23 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ (ఐ.అండ్.పీఆర్) ఆధ్వర్యంలో 2026వ సంవత్సరానికి సంబంధించిన స్వర్ణాంధ్ర ఏ 2047 క్యాలెండర్ లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంపన్న, ఆరోగ్యవంత,





సంతోషకరమైన రాష్ట్రం సాధన లక్ష్యంగా 2026వ సంవత్సరానికి సంబంధించిన స్వర్ణాంధ్ర ఏ 2047 క్యాలెండర్ లను రూపొందించడం జరిగిందని తెలిపారు. పది సూత్రాలు ఒక విజన్ అని, అందులో పేదరిక నిర్మూలన, అన్ని దశల్లో సమగ్ర సాంకేతికత, స్వచ్ఛంధ్ర, నాణ్యమైన ఉత్పత్తులు, విద్యుత్తు ఇందన రంగంలో వ్యయం తగ్గింపు, ప్రపంచ స్థాయి రవాణా వ్యవస్థ, వ్యవసాయంలో సాంకేతికత, నీటి భద్రత, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగాల కల్పన ముఖ్యమైనవన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు కోసం విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేయడం జరిగిందని తెలిపారు. – ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు కేశవనాయుడు, ఎస్డీసిలు రామ్మోహన్, పద్మావతి, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ ల మీద దాడులకు ప్రతిదాడులు ఉంటాయి జాగ్రత్త..

**– కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేష్..**



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 23:** సోమవారం ధర్మవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు తుంపర్తి పరమేష్ ఆధ్వర్యంలో ప్రెస్మీట్ నిర్వహించడం జరిగింది ఈసందర్బంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్ ను తాకట్టు పెట్టిన నరేంద్ర మోడీనే మొట్టమొదటి దేశద్రోహి అని ఎందుకంటే దేశ సంపదను కోళ్లగొట్ట అంబానీ ఆదానిలకు కట్టబెట్టి రాజ్యాంగన్ని వ్యవస్థ లని నాశనం చేస్తున్నారని ఇవన్నీ పార్లమెంట్ సాక్షి గా రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని అందుకు ప్రజలమద్దతు వస్తుండం చూసే కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ ల మీద దాడికి పాల్పడుతున్నారని మీ ఆటలు సాగనియ్యం అని చర్యకు ప్రతిచర్య ఉంటుందని హెచ్చరిస్తున్నాం.

## సీఎంఆర్ఎఫ్ ద్వారా 20నెలల్లో 304కుటుంబాలను ఆదుకున్నాం

**– సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా పరిటాల శ్రీరామ్**

**– తాజాగా 20మందికి రూ.15లక్షల చెక్కుల పంపిణీ**




**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 23:** కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద దిక్కులా అండగా నిలుస్తున్నారని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని పలు కుటుంబాల వారికి ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. నాలుగు మండలాలు, ధర్మవరం పట్టానికి చెందిన 20మందికి రూ.15లక్షలు విలువ చేసే చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు పరిటాల శ్రీరామ్ తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ కష్ట సమయాల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు అందని వారిని సీఎం సహాయనిధి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదుకుంటున్నారన్నారు. ఈ 20నెలల్లో తమ ద్వారా 304మందికి రూ.2.30కోట్ల మేర సాయం అందిందన్నారు. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఇంత పెద్ద మొత్తంలో సాయం అందలేదన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తున్నారన్నారు. వైద్య పరంగా ఏ కష్టం వచ్చినా ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు...



## కేసీ కెనాల్ కు సాగునీరు విడుదల చేయంచిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

**అంకుశం న్యూస్ నంద్యాల ఫిబ్రవరి 23:** నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల, జూపాడు బంగ్లా మండలాల కేసీ కెనాల్ ఆయకట్టు రైతుల విన్నపం మేరకు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి జిల్లా కలెక్టర్ ద్వారా సోమవారం సాగునీరు విడుదల చేయించారు. ముచ్చుమర్రిలో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా శుక్రవారం కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికీ రెండు తడులు నీరు పెడితే పంట చేతికి వస్తుందని, నీరు పెట్టకపోతే పంట రాక ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామని విన్నపం చేశారు. వెంటనే రైతుల సమస్య ను నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి దృష్టికీ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెచ్చారు. దీంతో జిల్లా కలెక్టర్ కేసీ కెనాల్ అధికారుల ద్వారా రైతుల పంటల వివరాలు సేకరించి రైతుల సమస్య అర్థం చేసుకున్న జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సోమవారం మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి ఒక పంపు, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా ఒక పంపు నుంచి కేసి కెనాల్ కు సాగునీరు విడుదల చేశారు. నీళ్ల లేక కేసీ కెనాల్ ఆయకట్టు ఎండిపోతుందన్న విషయం తెలుసుకొని సకాలంలో స్పందించి నీటిని విడుదల చేయించిన నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరికి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి లకు పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలం కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్ లోకి నీటి విడుదల

## శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవాల ట్రయల్ రన్



**అంకుశం న్యూస్ తిరుమల ఫిబ్రవరి 23:** తిరుమలలో ఫిబ్రవరి 26 నుండి మార్చి 2వ తేదీ వరకు సాలకట్ల తెప్పోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం స్వామి పుష్కరిణిలో తెప్పల ట్రయల్‌రన్ నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు.



ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ తెప్పోత్సవాలకు తెప్పలను పూర్తిగా సిద్ధం చేసినట్టు తెలిపారు. ఇంజినీరింగ్, విద్యుత్, ఆలయ అధికారులతో కలిసి తెప్ప సామర్థ్యాన్ని పరిశీలించినట్లు చెప్పారు. తొలిరోజు శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి, రెండో రోజు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివారు తెప్పలపై విహరిస్తారని వివరించారు. చివరి మూడురోజులు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు తెప్పలపై భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. మొదటి మూడు రోజులు మూడుసార్లు, 4వ రోజు ఐదుసార్లు, చివరిరోజు ఏడుసార్లు తెప్పలపై ఉత్సవ మూర్తులు విహరించి భక్తులను అనుగ్రహిస్తారని చెప్పారు. కాగా తెప్పోత్సవాల కారణంగా ఫిబ్రవరి 26, 27 తేదీల్లో సహస్రదీపాలంకార సేవ, ఫిబ్రవరి 28న, మార్చి 01, 02వ తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఈ తెప్పోత్సవాల ట్రయల్ రన్‌లో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఈఈలు శ్రీనివాసరావు, సుధాకర్, డిఈ చంద్ర శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.